క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

దొరవారిసత్రం : మండలంలోని కొత్తపల్లి గ్రామం గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను శనివారం స్థానిక ఎంఈవో కృష్ణయ్య తనిఖీ చేశారు. అపార్ ఐడీ ప్రోగ్రామ్ నమోదును పరిశీలించారు. విద్యార్థుల చదువులు ఏవిధంగా కొనసాగుతున్నాయని ఆరా తీశారు. ఆయన వెంట హెచ్ఎం సంజీవయ్య ఉన్నారు.

ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనూష

వెంకటగిరి రూరల్ : ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థ ఎంతో విశిష్టమైనదని, పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేసే చట్టాలు, ఇచ్చే ఆదేశాలు రాజ్యాంగబద్ధంగా ఉన్నాయా.. లేదా అని చూసే మహోన్నత వ్యవస్థ న్యాయ వ్యవస్థ అని పేర్కొన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు న్యాయశాఖలోని సంస్థలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గాంధీ, గిరిజాకుమారి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత



పాఠశాల ముందు గుంతలను పూడ్చుతున్న యువకులు

చిల్లకూరు : మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల ముందు గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ముందుకు వచ్చి శనివారం శ్రమదానం చేసి గుంతలను పూడ్చారు. వారు మాట్లాడుతూ గుంతలు పూడ్చి నీటిని బయటకు పంపించాలని పాఠశాల హెచ్ఎంను కోరామని, తమ దగ్గర అన్ని నిధులు లేవని వారు చెప్పారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో దళితవాడకు చెందిన యువకులు శ్రమదానం చేసేందుకు ముందుకు రావడంతో గ్రామానికి చెందిన రఘుబాబు పర్యవేక్షణలో సిలికా గనుల్లోని సిలికాను ట్రాక్టర్ల ద్వారా తరలించి గుంతలను పూడ్చినట్టు పేర్కొన్నారు.

అనాథకు అంత్యక్రియలు



మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలిస్తున్న మెగా బ్రదర్స్ సేవా సమితి సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం వృద్ధాశ్రమంలో ఉన్న అనాథ క్రిష్ణయ్య శనివారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మెగా బ్రదర్స్ సేవా సమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వారిని వృద్ధాశ్రమం నిర్వాహకులు కళ్యాణి అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు టి.చంద్రశేఖర్, ఓంకార్, మధుసూదన్, సాయికిరణ్, వెంకటేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీ దేవి, చెంచులక్ష్మీ దేవి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం అభిషేకం, అర్చనలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ చేశారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్య కల్యాణ మండపంలో కొలువుదీర్చి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మండలం తుమ్మూరు పాత శ్రీదేవి రైసు మిల్లు సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. విన్నమాలకు చెందిన దార్ల వెంకటరమణయ్య(26) ఆటో డ్రైవర్. ఆయన శనివారం ఆటోలో పండ్లూరుకు బయలుదేరాడు. తుమ్మూరు పాత శ్రీదేవి రైసు మిల్లు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హాస్టళ్లలో వసతులు పూజ్యం

వసతి గృహం నిర్వహిస్తున్న తలుపులు, కిటికీలు లేని భవనం



విద్యార్థులు ఉంటున్న తలుపులు, కిటికీలు లేని గది



నాయుడుపేటలో అధ్వానంగా మరుగుదొడ్లు



- ఒక్కో వార్డెన్‌కు అదనంగా రెండు హాస్టళ్ల బాధ్యతలు
- 50 శాతం మంది పిల్లలు కూడా ఉండని వైనం
- ప్రైవేటు వ్యక్తులతో వసతి గృహాల్లో వంటకాలు
- చుట్టపు చూపుగా వస్తున్న కుక్‌లు

వారంతా పేద పిల్లలు. తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత లేకపోవడంతో హాస్టళ్లలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారు. వారికి తగిన వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రైవేట్ వ్యక్తులతో వంట చేయిస్తున్నారు. రెగ్యులర్ వంట మనుషులు చుట్టపు చూపుగా వచ్చి వెళుతున్నారు. ఉడికీ ఉడకని అన్నం.. నీళ్ల సాంబారు పెడుతుండడంతో పిల్లలు పస్తులు ఉంటున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వార్డెన్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల సూళ్లూరుపేట జడ్జి ఎస్.అనూష పలు వసతి గృహాలను పరిశీలించారు. అక్కడి పరిస్థితులను చూసి విస్తుపోయారు. అయినా అధికారుల్లో చలనం లేదు.

నాయుడుపేట టౌన్ : సూళ్లూరుపేట డివిజన్ పరిధిలో నాయుడుపేట, గొట్టిప్రోలు, కళాశాలలకు సంబంధించి మహిళలు, పురుషుల వసతి గృహాలు, సూళ్లూరుపేట, తడ, చిన్న మాంబట్టు, రోసనూరు రాజుపాళెం, చిలమానుచేను, అత్తివరం, చిట్టమూరు, వాకాడు తదితర ప్రాంతాల్లో మొత్తం 12 బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వాటిలో సుమారు 700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వంట మనిషులు ఉన్నా ప్రైవేటు వ్యక్తులను పెట్టుకుని విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నారు. ప్రభుత్వ వంట మనుషులు వసతి గృహాలకు చుట్టపు చూపులా వచ్చివెళుతున్నారు. పిల్లలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను చెప్పేందుకు ట్యూటర్లను నియమించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు.

రికార్డుల్లో అధిక సంఖ్యలో విద్యార్థుల హాజరు..

నాయుడుపేట పట్టణం లోతువానిగుంట కాలనీలో ఉన్న బీసీ వసతి గృహంలో 73 మంది విద్యార్థులు ఉన్నట్టు రిజిస్టర్‌లో చూపారు. వాస్తవానికి 20 మంది మాత్రమే ఉంటున్నారు. ఇక్కడి పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. తడ వార్డెన్‌కు ఇన్‌చార్జి ఇచ్చారు. అలాగే పెళ్లకూరు మండలంలోని రోసనూరు రాజుపాళెం వసతి గృహం కూడా ఈయనకే కేటాయించారు. ఆయన మూడు హాస్టళ్లను సక్రమంగా పర్యవేక్షించలేకపోతున్నారు. ఈ క్రమంలో తమకు భోజనం సరిగ్గా పెట్టడం లేదని, తమతోనే మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తున్నారని పిల్లలు వాపోతున్నారు. గొట్టిప్రోలు బీసీ వసతి గృహంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు ఉదయం ఆరు బయట ప్రాంతాలకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. అదే విధంగా నాయుడుపేట పట్టణంలోని కళాశాలకు సంబంధించి పురుషులు, మహిళల బీసీ వసతి గృహాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో సరైన వసతులు లేవు. తలుపులు, కిటికీలు సైతం లేవు. దీంతో పిల్లలు రాత్రిళ్లు చలికి వణుకుతున్నారు. వసతి గృహం నిర్వహిస్తున్న మిద్దెకు అనుకుని విద్యుత్ తీగలు వెళుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది తీరం వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

సమస్యలు పరిష్కరిస్తాం..



నాయుడుపేట పట్టణంలోని కళాశాలలకు చెందిన విద్యార్థుల వసతి గృహాన్ని మరోచోటికి మార్చాలని వార్డెన్‌కు సూచించాం. అదే విధంగా నాయుడుపేట డివిజన్ పరిధిలోని వసతి గృహాలను పరిశీలించి నిర్లక్ష్యంగా వ్యవహరించే వార్డెన్లపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

– కృష్ణయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, నాయుడుపేట డివిజన్

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సు

వెంకటగిరి రూరల్ : కార్తీక మాసంలో భక్తుల కోరిక మేరకు వెంకటగిరి నుంచి పుట్టపర్తి, శబరిమలై, కోటిలింగాలు, అరుణాచలం తదితర శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెంకటగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ 7382886789, 7396085137, 7780435189, 7382887743 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

14న ప్రజాపోరు

గూడూరు రూరల్ : కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా విద్యుత్ చార్జీలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపుతుండడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. ఆయన శనివారం గూడూరులోని సీపీఎం కార్యాలయంలో ప్రజాపోరు పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని చెప్పి పేద ప్రజలను దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో దాడులు పెరిగాయని, వాటిని నివారించాలన్నారు. కార్యక్రమంలో మురళి, యాదగిరి, శివకుమార్, మణి, శ్రీనివాసులు, రమణయ్య, చంద్రయ్య, వెంకటప్ప,ముత్యాలయ్య, వెంకట్రావ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

రాపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో భవాని తెలిపారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి మూడు చక్రాల సైకిళ్లు, వినికిడి పరికరాలు అందజేస్తామన్నారు. దివ్యాంగులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్లు, రేషన్ కార్డు తీసుకురావాలన్నారు. వయో వృద్ధులు రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని వెల్లడించారు.

బెల్టు షాపులపై పోలీసుల ఆరా

దొరవారిసత్రం: మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణపై ఎస్ఐ అజయ్‌కుమార్ శనివారం ఆరా తీశారు. శ్రీధనమల్లిలో బెల్టు షాపు కోసం వేలపాట నిర్వహించడంపై శనివారం పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో పోలీసులు శ్రీధనమల్లి, కల్లూరు, మీజూరు, తొగరాముడి, ఉచ్చూరు, మైలాంగం, నెలబల్లి, బూదూరు గ్రామాల్లో పరిశీలించారు. శ్రీధనమల్లిలో గ్రామ పెద్దలతో పాటు కొందరు అధికార పార్టీ నేతలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

బీసీ గురుకులానికి పూర్వ విద్యార్థుల చేయూత

కోట: స్థానిక బీసీ గురుకుల పాఠశాల, కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో 2003, 2005, 2010లలో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం సమావేశమయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు. ఇక్కడ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ధనలక్ష్మీకి నివాళులర్పించారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో బోరు, వాచ్‌మెన్ గది నిర్మాణం, మెస్ గది మరమ్మతులు, ఇన్వర్టర్ కోసం రూ.3 లక్షల సాయం అందించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మహబూబ్‌బాష, నారపరెడ్డి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పూర్వవిద్యార్థి, దొరవారిసత్రం ఎస్ఐ అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ నారాయణరావు

జాతీయ ఆర్చరీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కోట: మండల కేంద్రమైన కోటలో ఉన్న ప్రగతి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థిని డి.నిష్విత జాతీయ స్థాయి ఆర్చరీ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కిషోర్ తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి మూడు రోజులు మన్యం జిల్లా జోగింపేట గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో అండర్-14 విభాగంలో సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ సాధించిందని తెలిపారు. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి గుజరాత్‌లోని నాదియార్ జిల్లాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో నిష్విత పాల్గొంటుందన్నారు. నిష్వితను ప్రిన్సిపాల్, ఆర్చరీ కోచ్ శివశంకర్ అభినందించారు.



నిష్వితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కిషోర్

ఘనంగా పుష్పయాగం



నాయుడుపేట టౌన్ : వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న స్కంధ షష్టి మహోత్సవాల్లో చివరి రోజు శనివారం పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణశర్మ, రవికుమార్ శర్మ, గణేష్ శర్మ, ఉభయదారులు, పీఠం సభ్యులు, సుబ్రమణ్యేశ్వర స్వామి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

నాయుడుపేట టౌన్ : 18 ఏళ్ల నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దారు రాజేంద్ర, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఓటరు జాబితాలో పేర్ల పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు చేర్పులపై నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపులను వారు శనివారం పరిశీలించారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో 37, మండల పరిధిలో 37 మొత్తం 74 కేంద్రాల్లో బీఎల్‌వోలు ఉంటారని వెల్లడించారు.

కండలేరులో 50.482 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 50.482 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 6,300 క్యూసెక్కుల నీరు చేరుతోందని వెల్లడించారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1070, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఆవుల అపహరణపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : ఆవులను అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారని నాయుడుపేట పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన బాధితుడు ఎస్ఎస్ జెమిని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీలను సైతం పోలీసులకు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో కొంతమంది ఆవులను మేపుకుంటున్నట్టు తెలిపారు. కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిళ్లు తిరుగుతూ ఆవులను ట్రక్కు ఆటోల్లో తరలించుకుపోతున్నట్టు తెలిపారు. సుమారు రూ.5 లక్షలకు పైగా విలువ చేసే ఆరుకు పైగా ఆవులను అపహరించినట్టు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో సాంకేతిక సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో శనివారం నెక్సస్‌వర్స్ 2.0 సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఇందులో పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు కోడ్‌క్వెస్ట్, రివర్స్ కోడింగ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు రాజశేఖర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపుల నిర్వహణకు వేలం పాటలు

- టీడీపీ నేతల కనుసన్నల్లోనే బెల్టు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు
- గ్రామీణ ప్రాంతాల్లో ఏరులైన పారనున్న మద్యం

అధికారాన్ని అడ్డుపెట్టుకుని కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి అక్రమార్జనకు పూనుకున్నారు. ప్రకృతి వనరులను అందినకాడికి దోచుకుంటున్నారు. అంతటితో ఆగక గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారించి ప్రజల నుంచి డబ్బు గుంజుకునేందుకు సిద్ధమయ్యారు. గ్రామా ల్లో బెల్టు షాపులు నిర్వహించుకునేందుకు వేలం పాటలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది.

సూళ్లూరుపేట : కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేట్ మద్యం షాపులకు అనుమతి ఇచ్చింది. సూళ్లూరుపేట ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో సూళ్లూరుపేట పట్టణంలో 14 షాపులకు గాను ఏడు షాపులు టీడీపీ వారికే వచ్చాయి. తడ మండలంలో ఐదు షాపులకు గాను నాలుగు టీడీపీకి దక్కాయి. దొరవారిసత్రంలో రెండు షాపులకు గాను రెండూ వైఎస్సార్‌సీపీ వారికి వచ్చాయి. ఈ మూడు మండలాల్లోని 59 పంచాయతీలు ఉన్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారించాలనుకున్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో ఉన్న టీడీపీ నాయకులకు బెల్టుషాపులు ఇవ్వాలని నిర్ణయించారు. పోటీ వచ్చిన చోట వేలం పాటలు నిర్వహించారు. దొరవారిసత్రం మండలం శ్రీధనమల్లిలో వేలంపాటలు నిర్వహించగా రూ.1.60 లక్షలకు పాట పాడుకున్నారు. ఇది వివాదంమై బయటకు రావడంతో అసలు విషయం తెలిసింది. సూళ్లూరుపేట మండలంలో పార్టీ మండల అధ్యక్షులకు ఈ బాధ్యతలు అప్పగించడంతో ఆయన పంచాయతీల వారీగా ఒక్కో నాయకుడిని ఎంపిక చేసి వారి నుంచి రూ.50 వేల వరకు డిపాజిట్టు రూపంలో వసూలు చేసినట్టు సమాచారం.

అధిక ధరలకు మద్యం విక్రయం

లక్షలు, వేలు పెట్టుబడి పెట్టి పాడుకున్న బెల్టుషాపుల నిర్వాహకులు మద్యాన్ని ఎమ్మార్పీపై రూ.20 నుంచి రూ.50ల వరకు అధికంగా విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని శాసిస్తున్న ఒక్క పెద్ద నాయకుడి కనుసన్నల్లోనే మద్యం షాపులు నడుస్తున్నాయి. వీరి ఆధ్వర్యంలోనే బెల్టుషాపులు కూడా నడవాలని హుకుం జారీ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల పరిధిలోని 21 షాపుల్లో 11 షాపులు టీడీపీ కూటమి వారివే కావడంతో తమ వారే బెల్టుషాపులు నిర్వహించుకోవాలి. వేరేవాళ్లు నిర్వహించేందుకు ముందుకు వచ్చినా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మద్యం షాపులకు అనుబంధంగా మద్యం సేవించేందుకు సర్వీస్ రూమ్‌లు వుండకూడదనే నిబంధనలు వున్నప్పటికీ పెడచెవిన పెడుతున్నారు. దీనిపై ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ టీడీపీ నాయకులను నమ్మి బెల్టుషాపులు నిర్వహిస్తే దాడులు చేసి పట్టుకుంటామని చెబుతున్నారు. ఆయన శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పినా మద్యం వ్యాపారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.